సాక్షి అనకాపల్లి

బుధవారం : 20 : ఆగస్టు : 2025



భారీగా గంజాయి స్వాధీనం

జిల్లాలో మూడు చోట్ల జరిపిన తనిఖీల్లో పోలీసులు 736 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ సరకు విలువ రూ.కోటికి పైగా ఉంటుంది. 8లో



కనికరం లేని పాలకులు

రోడ్డు వేయాలని 12 ఏళ్ల నుంచి పోరాటాలు చేస్తున్నా పాలకుల మనసు కరగడం లేదు. గొలుగొండ మండలం డొంకాడ గ్రామ గిరిజనుల సమస్య ఇది. 8లో

వాతావరణం



అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలికపాటి జల్లులతో వర్షం పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం తెలిపారు.

న్యూస్‌రీల్

22న కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

అనకాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లాల్లో ఇటీవల కానిస్టేబుల్ (సివిల్, ఏపీఎస్పీ) ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 22న సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఈ విషయాన్ని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన విశాఖలోని విశాలాక్షి నగర్, కైలాసగిరిలో ఉన్న ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ గ్రౌండ్‌లో జరుగుతుంది. అభ్యర్థులు ఉదయం 7 గంటల కల్లా అక్కడకు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఎంపిక ప్రక్రియ సమయంలో సమర్పించిన జిరాక్స్ కాపీలకు సంబంధించిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఆయన కోరారు.

నేటి నుంచి 24 వరకు కోర్టు ఉద్యోగాలకు పరీక్షలు

విశాఖ-లీగల్ : జిల్లాలోని న్యాయస్థానాలలో వివిధ ఉద్యోగాల నియామకాలకు బుధవారం నుంచి 24వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో మీడియాతో ఈ వివరాలు వెల్లడించారు. స్టెనోగ్రాఫర్- ఐఐఐ, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఫీల్డ్ అసిస్టెంట్, ఎగ్జామినర్, కాపీయిస్ట్, డ్రైవర్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు ఈ పరీక్షలు జరుగుతాయని, రోజుకు మూడు షిఫ్టుల్లో కంప్యూటర్ ద్వారా పరీక్షలు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందే కేంద్రాలకు చేరుకోవాలని, గేట్లు మూసిన తర్వాత ఎవరినీ అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. హాల్ టికెట్‌తో పాటు ఐడీ ప్రూఫ్‌ను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే 0863-237252 నంబర్‌కు లేదా helpdesk-hc.ap.aij.gov.in మెయిల్‌కు సంప్రదించాలని తెలిపారు. పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు తర్వాత స్కిల్ టెస్ట్ ఉంటుందని, దివ్యాంగులు లేదా మెడికల్ ఎమర్జెన్సీ ఉన్నవారికి అభ్యర్థన మేరకు స్క్రైబ్‌ను ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. నిబంధనల ప్రకారమే పరీక్షలు జరుగుతాయని, ఎలాంటి ప్రలోభాలకు ఆస్కారం లేదని, వదంతులు నమ్మవద్దని ఆయన సూచించారు.

మెలిపాక విద్యార్థికి పీజీ నీట్‌లో 1913వ ర్యాంక్



గుర్రం శ్రీనివాస్ కుమార్

మునగపాక: మండలంలోని మెలిపాకకు చెందిన డాక్టర్ గుర్రం శ్రీనివాస్ కుమార్ పీజీ నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో జాతీయ స్థాయిలో 1913వ ర్యాంక్ సాధించారు. 2025 సంవత్సరానికి గాను ఇటీవల నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. మంగళవారం సాయంత్రం విడుదలైన ఫలితాల్లో శ్రీనివాస్ కుమార్ 612/800 మార్కులతో మెరుగైన ర్యాంక్ తెచ్చుకున్నారు. ఎండీ జనరల్ మెడిసిన్‌లో చేరేందుకు అర్హత సాధించారు. తర్వాత సూపర్ స్పెషలైజేషన్ చేసి న్యూరాలజిస్టుగా ప్రజలకు సేవలందించాలన్న లక్ష్యం తనకుందని శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఆయన తండ్రి శ్రీనివాస్ చూచుకొండ పీహెచ్‌సీలో ఆరోగ్య విస్తరణ అధికారిగా సేవలందిస్తున్నారు. తల్లి గృహిణి కాగా సోదరి వీర వెంకట శరణ్య ఆంధ్ర వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం చదువుతోంది.

ఎన్టీపీసీ విజిలెన్స్ అవేర్‌నెస్ క్యాంపెయిన్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎన్టీపీసీ చీఫ్ విజిలెన్స్ అధికారి రష్మితా ఝా

పరవాడ: దేశంలోనే అతిపెద్ద విద్యుత్ సంస్థ అయిన ఎన్టీపీసీలో మూడు నెలలపాటు జరిగే 'విజిలెన్స్ అవేర్‌నెస్ క్యాంపెయిన్' మంగళవారం ప్రారంభమైంది. న్యూఢిల్లీలోని స్కోప్ కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్టీపీసీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సీవీఓ) రస్మితా ఝా ఈ ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విజిలెన్స్ అనేది మనందరి భాగస్వామ్య బాధ్యత అని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను, కేసులను సకాలంలో పరిష్కరించాలని, పారదర్శకతను పెంచేందుకు డిజిటల్ విధానాలను బలోపేతం చేయాలని ఆమె అధికారులను కోరారు. ఉద్యోగులు, విక్రేతలు, ప్రజలందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. నాటకాలు, క్విజ్‌లు, వీడియోలు, విక్రేతల సమావేశాల ద్వారా ఈ ప్రచారాన్ని సృజనాత్మకంగా నిర్వహించాలని ఆమె అన్నారు. గతేడాది ఈ ప్రచారం విజయవంతమైందని, ఈ ఏడాది కూడా విజయం సాధిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రచారం నవంబర్ 17 వరకు కొనసాగుతుందన్నారు.

ముంపు తగ్గినా ముప్పు తప్పలేదు



కోతకు గురైన వడ్డాది డైవర్షన్ రోడ్డు



రైవాడ జలాశయం స్పిల్ వే గేటు ద్వారా విడుదల చేస్తున్న వరద నీరు



గండి పడ్డ పేట డైవర్షన్ రోడ్డు

- కొట్టుకుపోయిన పేట డైవర్షన్ రోడ్డు
- కోతకు గురైన వడ్డాది డైవర్షన్ రోడ్డు

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రహదారిలో డైవర్షన్ రోడ్లు నీటి ముంపు నుంచి బయటపడినా ఇంకా ప్రమాదం పొంచి ఉంది. విజయరామరాజుపేట తాచేరు వంతెనపై ఉన్న డైవర్షన్ రోడ్డు పూర్తిగా గండి పడింది. వడ్డాది పెద్దేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్డుకు మాత్రం నీటి ఉధృతి తగ్గింది. అయితే కరెంట్ ఆఫీసు పక్క వైపు గండి పడింది. పెద్దేరు నదిలో నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఇంకా డైవర్షన్ రోడ్డుపై నుంచే నీరు ప్రవహిస్తోంది. దీంతో రెండు డైవర్షన్ రోడ్లకు ఇంకా మరమ్మతులు చేపట్టలేదు. విశాఖ, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం వైపు వెళ్లే వాహనదారులు రవాణా సదుపాయం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. వడ్డాది, విజయరామరాజుపేట, మంగళాపురం తదితర గ్రామాల్లో పలు పంటలు నీటి ముంపు నుంచి ఇంకా బయట పడలేదు.

'తాండవ'లో పెరుగుతున్న నీటిమట్టం

నాతవరం: తాండవ రిజర్వాయరులో నీటిమట్టం క్రమేపీ పెరుగుతోందని ప్రాజెక్టు జేఈ శ్యామ్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ నీటిమట్టం సాయంత్రానికి 375.8 అడుగులకు చేరిందన్నారు. ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో 1800 క్యూసెక్కులు వచ్చి ప్రాజెక్టులో చేరుతోందన్నారు. ప్రస్తుతం తాండవ ప్రధాన గేట్ల ద్వారా పంట కాలువలోకి రోజుకు 310 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

'రైవాడ' నుంచి 500 క్యూసెక్కులు విడుదల

దేవరాపల్లి: రైవాడ జలాశయం నుంచి స్పిల్ వే గేటు ద్వారా 500 క్యూసెక్కుల వరద నీటిని మంగళవారం సాయంత్రం శారదానదిలోకి విడుదల చేశారు. 7వ నెంబర్ గేటు ద్వారా నీటిని విడుదల చేసినట్లు జలాశయం డీఈఈ జి.సత్యంనాయుడు తెలిపారు. జలాశయంలోకి 2000 క్యూసెక్కుల (ఇన్‌ఫ్లో) వరదనీరు వచ్చి చేరుతోంది. జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 113.35 మీటర్లకు చేరుకుంది. శారదానది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది దాటే ప్రయత్నం చేయవద్దని డీఈఈ సూచించారు.

సహనానికి పరీక్ష



బస్సులో సీట్లు నిండి నిలుచొని ప్రయాణిస్తున్న మహిళలు

- ఉచిత బస్సు ప్రయాణంలో మహిళలకు అవస్థలు
- రద్దీకి తగిన సంఖ్యలో బస్సులు కేటాయించాలంటున్న ప్రయాణికులు

కశింకోట:

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం మహిళల సహనాన్ని పరీక్షిస్తోంది. బస్సులు సరిపోక నిలుచొని ప్రయాణించాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. రద్దీ వల్ల కొన్ని బస్సులు బస్టాపుల్లో నిలపకుండా వెళ్లిపోతుండటంతో ప్రధానంగా విద్యార్థులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ఖాళీ బస్సులు వచ్చే వరకు ఎక్కువ సమయం నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. దీనివల్ల స్కూళ్లు, కళాశాలలకు సకాలంలో చేరుకోలేకపోతున్నామని, తిరుగు ప్రయాణంలో ఇళ్లకు చేరడం ఆలస్యమవుతోందని ఆవేదన చెందుతున్నారు. దీని దృష్ట్యా ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో ఎక్కువ బస్సులు నడపడానికి అధికారులు చర్యలు తీసుకోవాలంటున్నారు.

ఆధార్ జెరాక్స్ అనుమతించాలి

ఆధార్ ఒరిజినల్ కార్డు ఉంటేగాని కండక్టర్లు అనుమతించడం లేదని, దీంతో యథావిధిగా టికెట్ తీసుకొని ప్రయాణించాల్సి వస్తోందంటున్నారు. దీంతో చేతి చమురు వదులుతోందని, ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ప్రయోజనం లేకుండా పోతోందని ఆవేదన చెందుతున్నారు. ఆధార్ జెరాక్స్ కాపీతో కూడా అనుమతించాలంటున్నారు. ఉచిత ప్రయాణానికి ఏ కేటగిరి బస్సులు ఎక్కి ప్రయాణించాలో తెలియడం లేదని, ఈ విషయమై విస్తృత ప్రచారం కల్పించాలంటున్నారు. ఇదిలా ఉండగా కొందరు మహిళలు ఏ పనీ లేకపోయినా ఉచిత ప్రయాణమని ఉత్సాహంతో అనవసరంగా తిరుగుతూ అతి తక్కువ దూరానికే బస్సులు ఎక్కి, దిగుతుండటం, గమ్యాలకు చేరకుండానే మధ్యలో దిగిపోవడం చేస్తున్నారని, వారికి టిక్కెట్లు ఇవ్వాల్సి రావడం కూడా ఇబ్బందిగా పరిణమిస్తోందని ఆర్టీసీ సిబ్బంది ఆవేదన చెందుతున్నారు.

సమష్టి కృషితో ఎన్‌ఎస్టీఎల్ అద్భుతాలు

- డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి.కామత్



వరుణాస్త్ర బెలూన్ రికవరీ సిస్టమ్ సాంకేతికతను బీడీఎల్ ప్రతినిధికి అందిస్తున్న డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వి.కామత్

గోపాలపట్నం (విశాఖ): శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, విద్యాసంస్థలు, నేవీ అధికారుల సమష్టి కృషితో ఎన్‌ఎస్టీఎల్ అద్భుతాలను సృష్టిస్తోందని డీడీ ఆర్ అండ్ డీ కార్యదర్శి, డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి.కామత్ అన్నారు. మంగళవారం ఎన్‌ఎస్టీఎల్ 56వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశాన్ని రక్షణ రంగంలో సాధికారత వైపు నడిపించడంలో ఎన్‌ఎస్టీఎల్ 56 ఏళ్ల ప్రయాణం ఎంతో కీలకమన్నారు. ఈ ప్రయాణంలో కృషి చేసిన ఉద్యోగులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్‌ఎస్టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ 1969 ఆగస్టు 20న కేవలం 10 మందితో ప్రారంభమైన ఎన్‌ఎస్టీఎల్.. అంచెలంచెలుగా అభివృద్ధి చెంది ఇప్పుడు 184 మంది శాస్త్రవేత్తలు, 662 మంది ఉద్యోగులు సేవలందిస్తోందన్నారు. జలాంతర యుద్ధ ఆయుధాలు, వ్యవస్థల అభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రక్షణ రంగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తోందన్నారు. డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్(మెటీరియల్స్ అండ్ సిస్టమ్స్) ఆర్.వి.హరప్రసాద్, మెటీరియల్ అసిస్టెంట్ చీఫ్(డాక్ యార్డ్ అండ్ రిఫిట్) రియర్ అడ్మిరల్ అరవింద్ రావల్ కూడా ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా 25 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న అధికారులు, సిబ్బందిని సత్కరించారు. ఉత్తమ గ్రంథాలయ వినియోగదారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే మొత్తం 40 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించారు. వరుణాస్త్ర కోసం రూపొందించిన 'బెలూన్ రికవరీ సిస్టమ్' సాంకేతికతను భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థ(బీడీఎల్)కు బదిలీ చేశారు. డాక్టర్ సమీర్ వి.కామత్ చేతుల మీదుగా ఈ సాంకేతికతను బీడీఎల్ డైరెక్టర్(ప్రాజెక్ట్స్) పి.వి.రాజారామ్‌కు అందజేశారు. ఎన్‌ఎస్టీఎల్ అభివృద్ధి చేసిన జీటీ-ఐఆర్‌ఎస్‌ఎస్‌ను ఆయన రియర్ అడ్మిరల్ అరవింద్ రావల్‌కు అందించారు. స్వదేశీ రాడార్ క్రాస్ సెక్షన్ ప్రిడిక్షన్ సాఫ్ట్‌వేర్ 'నిర్వాణ'ను కూడా విడుదల చేశారు. ఎన్‌ఎస్టీఎల్ హిందీ మ్యాగజైన్ 'మథన్'8వ సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, నిర్వహణ కమిటీ సభ్యులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి ఆస్తుల జప్తు

రోలుగుంట: గంజాయి కేసులో నిందితుడి ఆస్తులు జప్తు చేస్తున్నట్టు కొత్తకోట సీఐ కోటేశ్వరరావు తెలిపారు. రోలుగుంట మండలం ఎస్.కొత్తూరు పంచాయతీ శివారు గొల్లపేట గ్రామానికి చెందిన వియ్యపు గోవిందపై పలు గంజాయి కేసులున్నాయి. ఈ వ్యాపారంపై వచ్చిన ఆదాయంతో ఆస్తులు సంపాదించాడు. ఇతని ఆస్తులు గుర్తించాలని అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు కొత్తకోట సీఐ నిందితుడి ఆస్తులను ఆరా తీశారు. నక్కపల్లి, రోలుగుంటలో సుమారు 1.23 ఎకరాల వ్యవసాయ భూములను కొనుగోలు చేసినట్టు గుర్తించి నివేదికను ఎస్పీకి నివేదించారు. ఈ ఆస్తుల ప్రభుత్వ విలువ సుమారు రూ.8 లక్షలు కాగా మార్కెట్ విలువ సుమారు రూ.40 లక్షలుంటుందని అంచనా వేశారు. చెన్నైలోని కాంపిటెంట్ అథారిటీకి ఫ్రీజింగ్ ఆర్డర్ ద్వారా నివేదిక సమర్పించగా వారు పరిశీలించి సదరు ఆస్తులను జప్తు చేయడానికి ఉత్తర్వులు ఇచ్చారని ఆయన తెలిపారు.

గోశాల అక్రమాలపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..



పెనుగొల్లు గోశాల వద్ద విచారణ చేస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు

ఎస్.రాయవరం: మండలంలో గోశాల పేరుతో పశువుల అక్రమ తరలింపుపై 'రక్షకులు కాదు.. గో భక్షకులు' శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఎట్టకేలకు అధికారులు స్పందించారు. పెనుగొల్లు గ్రామంలో ఉన్న గోశాలను జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రామ్మోహన్‌రావు మంగళవారం పరిశీలించారు. ఫిర్యాదీ సోమిరెడ్డి రాజు నుంచి మరిన్ని వివరాలు తీసుకున్నారు. ఈ నెల 12న తమ శాఖ అధికారులు వచ్చి గోశాలను పరిశీలించారని, గోశాలలో ఒక్క పశువు కూడా లేదని నివేదిక ఇచ్చారని, దానిపై సమగ్ర విచారణ చేపట్టేందుకు తాము వచ్చినట్టు చెప్పారు. తమ శాఖ నివేదిక పూర్తయిన తరువాత గోశాల అనుమతి రద్దు చేసేందుకు సిఫార్సు చేస్తామన్నారు. గోశాల అనుమతులతో చేసిన అక్రమాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విచారణలో పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వీర్రాజు, నక్కపల్లి వైద్యులు గీతవర్మ, అనకాపల్లి జిల్లా వైద్యులు నోడల్ అధికారి హన్నాకుమారి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో వడివడిగా వరినాట్లు



ఒడ్డిమెట్ట సమీపంలో రైతులతో కలసి వరినాట్లు వేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

నక్కపల్లి: గడచిన నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు అన్నదాతలకు మేలు చేశాయి. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడకపోవడంతో వరిసాగుపై రైతుల్లో ఆందోళన నెలకొంది. నారు మొలకెత్తినప్పటికీ అవసరమైన నీటి సదుపాయం లేకపోవడం, వర్షాలు పడకపోవడంతో ఆదుర్దా పడ్డ రైతులకు తాజాగా మారిన వాతావరణ పరిస్థితులు ఉపశమనం కలిగించాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా అవసరమైన నీరు అందుబాటులోకి రావడంతో వరినాట్లు జోరందుకున్నాయి. మంగళవారం దేవవరం, చినరామభద్రపురం గ్రామాల్లో ప్రారంభమైన వరినాట్లను జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్‌లు పరిశీలించారు. పొలాల్లోకి దిగి రైతులతో కలిసి వరినాట్లు వేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు మాట్లాడుతూ వరిపంట కాలంలో 32 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం , 20 కిలోల పొటాషియం వేసుకోవాలన్నారు. మొదటి దమ్ము చేసేటప్పుడు 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేసి దమ్ము చేయడం ద్వారా పచ్చిరొట్ట ఎరువులు కలుపు ఎరువుగా మారతాయన్నారు. సింగిల్ ఫాస్ఫేట్ వేయకపోతే చివరి దమ్ములో 50 కిలోల డీఏపీ, 15 కిలోల పొటాష్ వేస్తే దుబ్బు చేసే దశ అనగా సుమారు 25 నుంచి 35 రోజుల దశలో కలుపు తీసిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా వేస్తే సరిపోతుందన్నారు. అంకురం దశలో అడుగు పొట్ట దశలో ఉన్నప్పుడు ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేయాలన్నారు.

మూడింతల సర్వీస్ ఉన్నా.. ప్రమోషన్ సున్నా

- ఆరేళ్ల సీనియారిటీ ఉన్న సివిల్ కానిస్టేబుళ్లకు ప్రమోషన్ అర్హత
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 15 నుంచి 20 ఏళ్ల సర్వీసున్న కానిస్టేబుళ్లు 150 మంది
- ఐదు నెలల క్రితం వారికి హెచ్‌సీ శిక్షణ కూడా ఇచ్చిన పోలీస్ శాఖ
- సాంకేతిక అంశాలపై రిట్ పిటిషన్ వేసిన ఇతర విభాగాల వారు
- కోర్టు కేసు ఉందని పదోన్నతుల ప్రక్రియ నిలిపివేసిన ప్రభుత్వం





అనకాపల్లి జిల్లాలో బి.వెంకట్రావ్ (పేరు మార్పు) అనే కానిస్టేబుల్ 2009లో సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరారు. దాదాపుగా 16 ఏళ్ల పాటు వివిధ పోలీస్‌స్టేషన్లలో సివిల్ కానిస్టేబుల్‌గా పనిచేశారు. కానీ హెడ్ కానిస్టేబుల్‌గా (హెచ్‌సీ) పదోన్నతి రాలేదు. ఇటీవల పదోన్నతి శిక్షణ కూడా పూర్తయింది. శిక్షణ పూర్తి చేసుకుని ఐదు నెలలుగా పదోన్నతి కోసం ఎదురుచూస్తున్నారు. కోర్టులో కేసు ఉందని పదోన్నతుల ప్రక్రియ నిలిపివేశారు. కొందరి కోసం అందరి ప్రమోషన్లు ఆపడం తగదని వాపోతున్నారు.



సాక్షి, అనకాపల్లి:

ప్రజలకు రక్షణగా ఉండే పోలీస్ వ్యవస్థలో అత్యంత కీలకంగా ఉన్న సివిల్ కానిస్టేబుళ్లు పదోన్నతి కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. సివిల్ కానిస్టేబుల్‌గా ఆరేళ్ల సర్వీసు పూర్తయ్యాక సాధారణంగా పదోన్నతి ఇస్తారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా 20 ఏళ్లుగా పదోన్నతులు లేవు. ఇటీవల సీనియర్ కానిస్టేబుళ్లకు మూడు వారాలపాటు పదోన్నతి శిక్షణ ఇచ్చారు. ట్రైనింగ్ పూర్తయి ఐదు నెలలు గడిచినా వారికి పదోన్నతులు రాలేదు. రాష్ట్రంలో ఇలాంటి బాధితులు 869 మంది ఉన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 150 మంది సీనియర్ కానిస్టేబుళ్లు పదోన్నతి కోసం ఎదురుచూస్తున్నారు.

ప్రీ ప్రమోషన్ ట్రైనింగ్..

రాష్ట్రవ్యాప్తంగా 869మంది సీనియర్ కానిస్టేబుళ్లను గుర్తించి ఈ ఏడాది మార్చి 7వ తేదీ నుంచి 27 వరకు ట్రైనింగ్ సెంటర్లలో శిక్షణ ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ విధి విధానాలు, బాధ్యతల గురించి వారికి తగిన తర్ఫీదు ఇచ్చారు. ఈ ట్రైనింగ్ జరుగుతుండగా ఏపీఎస్‌పీ నుంచి ఏఆర్, ఏఆర్ నుంచి సివిల్‌కు కన్వర్షన్ అయిన కొంతమంది కానిస్టేబుళ్లు ఈ ప్రక్రియ నిలిపివేయాలని హైకోర్టులో రిట్ పిటిషన్ వెయ్యడంతో ఈ ప్రక్రియను మధ్యలో నిలిపివేశారు. ప్రతి జిల్లాలో 30 నుంచి 40 వరకు హెడ్‌కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. శిక్షణ ఇచ్చి ఈ పోస్టులు భర్తీ చేస్తారని, తమకు అవకాశం వస్తుందని ఎదురుచూస్తున్న కానిస్టేబుళ్లకు నిరాశ ఎదురైంది. ఇలాంటి సీనియర్ సివిల్ కానిస్టేబుళ్లు అనకాపల్లి జిల్లాలో 60 మంది, విశాఖ జిల్లాలో 65 మంది, అల్లూరి జిల్లాలో 25 మంది ఉన్నారు. కోర్టు కేసు ఉందని ప్రభుత్వం తమ ప్రమోషన్ల ప్రక్రియను పక్కన పెట్టడం తగదని, సాంకేతిక సమస్యలను పరిష్కరించి, తమకు న్యాయం చేయాలని ప్రమోషన్ కోసం ఎదురుచూస్తున్న బాధిత కానిస్టేబుళ్లు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఇళ్లు నిర్మించని లబ్ధిదారుల నుంచి సొమ్ము వాపస్

• కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం

తుమ్మపాల: గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అందించే నిధులతోపాటు అదనపు ఆర్థిక సహాయం పొంది ఇళ్ల నిర్మాణం పూర్తిచేయని లబ్ధిదారుల నుంచి తిరిగి నగదును వసూలు చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గృహ నిర్మాణ శాఖ కార్యక్రమాల పురోగతిపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు జిల్లాలో 4,328 ఇళ్లను పూర్తి చేయవలసి ఉందన్నారు. గృహాల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు ఆర్థిక సహాయం ఉపయోగించి లబ్ధిదారులు గృహాల నిర్మాణం చేయవలసి ఉందన్నారు. గృహనిర్మాణ శాఖ పీడీ వై.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



రాంబిల్లి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

రాంబిల్లి (అచ్యుతాపురం): ఎస్పీ తుహిన్ సిన్హా మంగళవారం రాంబిల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఆర్ఐ దాడుల నేపథ్యంలో ఎస్పీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆయన నూతనంగా నిర్మించిన రిసెప్షన్ కౌంటర్‌ను, కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులపై వెంటనే స్పందించాలని సిబ్బందికి సూచించారు. పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలన్నారు. కేసుల పురోగతిని సమీక్షించి, రికార్డులను తనిఖీ చేశారు. పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్, ఎస్ఐ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

22న జాబ్ మేళా

కంచరపాలెం: వివిధ సంస్థల్లో ఖాళీగా ఉన్న సుమారు 100 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్(ఎన్‌సీఎస్‌సీ)లో ఈ నెల 22న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సెంటర్ ఉప ప్రాంతీయ అధికారి నిట్టాల శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. క్లర్క్, డ్రైవర్, ఫార్మసిస్ట్, ట్రైనర్ వంటి ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణత సాధించిన 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, హైదరాబాద్, అనకాపల్లి, నెల్లూరు, గుంటూరు వంటి ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుంది. ఆయా ఉద్యోగాలను బట్టి వార్షిక వేతనం రూ.1.8 లక్షల నుంచి రూ. 4.8 లక్షల వరకు ఉంటుంది. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలోని ఎన్‌సీఎస్‌సీ కేంద్రానికి ఉదయం 10 గంటలకు తమ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన సూచించారు.

కనికరం లేని పాలకులు

• గిరిజనులకు రోడ్డు లేక ఇబ్బందులు
• ఇప్పటికీ అనారోగ్యం వస్తే డోలీమోతలే శరణ్యం
• పుష్కరకాలంగా రోడ్డుకోసం పోరాటం
• డొంకాడ గిరిజన గ్రామస్తుల దీనావస్థ



ఈ బురద రోడ్డే దిక్కు



అనారోగ్యంతో ఉన్న బాలింతను డోలీపై తీసుకువెళుతున్న గిరిజనులు (ఫైల్)



అటవీ ప్రాంతం నుంచి చదువులకు వెళుతున్న చిన్నారులు

గొలుగొండ: పాలకులకు ఆదివాసీ గిరిజనులపై చిన్నచూపు పోలేదు. రోడ్డు వేయాలని 12 సంవత్సరాలు నుంచి పోరాటాలు చేస్తున్నా కనీసం కనికరం చూపలేకపోతున్నారు. గొలుగొండ మండలం డొంకాడ గిరిజన ప్రజలు దుస్థితి నేటికి అధ్వానంగా ఉంది. అటవీమార్గంలో నడుచుకుంటూ బయట ప్రపంచానికి రావాల్సి వస్తుంది. అనారోగ్యం వస్తే డోలీమోతలు తప్పడం లేదు. రోడ్డు వేయాలని చిన్నారులు మోకాళ్లపై నిరసన చేసినా పాలకులు ఈ గ్రామం వైపు కన్నెత్తి చూడలేదు. మండల కేంద్రం, డివిజన్ కేంద్రంలో ఆందోళనలు చేసినా అధికారులు పట్టించుకోలేదు.

రోడ్డులేక అవస్థలు

గొలుగొండ మండలం కొత్త ఎల్లవరం గ్రామ పంచాయతీ శివారు ప్రాంతంలో డొంకాడ గిరిజనులు నివాసం ఉంటున్నారు. అరిల్లోవ అటవీప్రాంతంలో పోడు వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా కొయ్యూరు మండలం పలకజీడి గ్రామంలో 14 ఏళ్ల క్రితం మావోయిస్టులకు వ్యతిరేకంగా అక్కడ జరిగిన ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడంతో మావోయిస్టులు ఆగ్రహానికి గురై మండలం నుండి వెలివేయబడ్డారు. దీంతో సుమారుగా 15 కుటుంబాలకు చెందిన 90 మంది అక్కడ నుండి వచ్చి ఆరిల్లోవ అటవీప్రాతంలో తలదాచుకున్నారు. రెండేళ్ల తరువాత వారికి రేషన్‌కార్డులు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించినా ఇప్పటి వరకూ బడి, రోడ్డు అందని ద్రాక్షగానే ఉంది. వీరు పండించిన పంటలు కాలినడకన బయటకు తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. తమ గ్రామానికి రోడ్డు వేయాలని 12 ఏళ్లుగా వేడుకున్నా, ఆందోళనలు చేసినా, నిరసనలు తెలిపినా పాలకుల చెవికెక్కలేదు.

వర్షం వస్తే నరకయాతనే...

డొంకాడ గిరిజనులకు వర్షం కురిస్తే బయటకు రాలేని దుస్థితి నెలకొని ఉంది. కాలినడకన అటవీప్రాతం నుంచి బయటకు రావడం అంటే నరకమే. దీనికితోడు ఇక్కడ 20 మంది వరకు చిన్నారులు ఉన్నారు. ఈ గ్రామంలో బడి లేకపోవడంతో డొంకాడకు నాలుగు కిలోమీటర్ల దూరంలో జిల్లెడిపూడి గిరిజన గ్రామంలో చదువులకు వస్తుంటారు. వర్షం కురిస్తే చిన్నారులు జిల్లెడిపూడి రావడానికి నరకయాతన పడుతుంటారు. ఈ వర్షాకాలంలో దాదాపు 70 శాతం బడికి సెలవే.

రోగులు, గర్భిణులకు డోలీమోతలే...

గ్రామం నుంచి ఆరిల్లోవ అటవీప్రాంతంలో ఉన్న కృష్ణదేవిపేట- నర్సీపట్నం రోడ్డుకు రావాలంటే మూడు కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. సాధారణంగా ఏజెన్సీ ప్రాంతంలో డోలీమోతలు ఎక్కువగా కనిపించడం జరుగుతుంది. కానీ మైదానంలో కూడా ఇటువంటి పరిస్థితులు ఉన్నాయనడానికి డొంకాడ వాసులే నిదర్శనం. ఎన్నికల ముందు కొత్త ఎల్లవరం పంచాయతీ కూటమి నేతలు ప్రభుత్వం వచ్చిన వెంటనే రోడ్డు వేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకూ పట్టించుకోలేదు.



రోడ్డు వేయాలని మోకాళ్లపై నిరసన తెలుపుతున్న చిన్నారులు (ఫైల్)

ఎన్నో పోరాటాలు

రోడ్డు కోసం ఆదివాసీ గిరిజనలు చేయని పోరాటాలు లేవు. వందలసార్లు రోడ్డు వేయాలని మండల కేంద్రం వద్ద ఆందోళన చేశారు. నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. మూడు రోజుల క్రితం నర్సీపట్నంలో వినూత్నంగా డోలిమోతలకు నిరసన తెలిపారు. పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందించారు. గ్రామంలో వారి సమస్యలకు అద్దంపట్టే విధంగా మోకాళ్లపై చిన్నారులు నిరసన చేశారు. రోడ్డు లేక చదువులకు దూరం అవుతున్నామని ఆందోళన చేశారు. అయితే అవేవీ పాలకుల్లో కనికరం కలిగించలేదు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దే త్వరలో ఆందోళన చేస్తామని రోడ్డువేసే వరకు అక్కడే గిరిజనలు నివాసం ఉంటామని తెలుపుతున్నారు.

గత ప్రభుత్వంలో నిధులు మంజూరు

గిరిజనుల రోడ్డు సమస్యపై గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగింది. నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ వారి సమస్యను దృష్టిలో ఉంచుకొని 2023లో జివో నెంబర్ 726 ఇంపాక్ట్ నిధుల నుంచి మంజూరు చేశారు. అటవీశాఖ అనుమతులు కోసం చర్యలు తీసుకున్నారు. రోడ్డు పనులకు శంకుస్థాపన కూడా చేశారు. అటవీశాఖ అనుమతులు రావడం కాస్త ఆలస్యం కావడం, ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో పనులు జరగలేదు. తరువాత కూటమి సర్కార్ రావడంతో పాటు అటవీశాఖ అనుమతులు వచ్చినా పనులు ప్రారంభం చేయకపోవడం గమనార్హం.

ఆందోళన ఉధృతం చేస్తాం



అన్ని అనుమతులు వచ్చినా రోడ్డు వేయలేదు. వర్షాకాలంతో మా కష్టాలు చెప్పలేనంతగా ఉన్నాయి. ఈ సీజన్‌లో ఆగాకర, బీర పంటలు అధికంగా వేస్తున్నాం. పండిన పంట కావిళ్లపై తీసుకురావడంలో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఎవరికైనా అనారోగ్యం వచ్చినా నరకం చేస్తున్నాం. చిన్నారులు బడికి వెళ్లలేని దుస్థితి నెలకొంది. మా సమస్యపై మండల, డివిజన్ కేంద్రాల్లో ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. మా సమస్యలు తీర్చకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

–సత్తిబాబు, డొంకాడ గ్రామం

మూడు చోట్ల భారీగా గంజాయి స్వాధీనం

• మొత్తం 736 కేజీల గంజాయి పట్టివేత
• విలువ రూ.కోటి పైమాటే

పాయకరావుపేట : జాతీయ రహదారిపై రవాణా చేస్తున్న రూ.40 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపారు. ఆయన మంగళవారం తన కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా, నిడదవోలు మండలానికి చెందిన బైపురెడ్డి రత్నం, తూర్పుగోదావరి జిల్లా రాగంపేట గ్రామానికి చెందిన ఎర్రమిల్లి నాగవీరశివ, కాకినాడ జిల్లా సిరిపురం గ్రామానికి చెందిన కొళ్ల నాగసతీష్ కలిసి యక్స్ యువి పిడబ్ల్యూడి 500 డబ్ల్యు 8 మహేంద్ర కారులో జాతీయ రహదారిపై గంజాయి రవాణా చేస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు సీతారాంపురం జంక్షన్ వద్ద సీఐ జి.అప్పన్న తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేసి పట్టుకున్నారని తెలిపారు. కారులో నాలుగు బస్తాల గంజాయిని గుర్తించి, కారుతో పాటు నిందితులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో బైపురెడ్డి రత్నం భర్తకు గతంలో పరిచయం చేసిన నర్సీపట్నానికి చెందిన వ్యక్తితో ఒప్పందం కుదుర్చుకుని 200 కేజీల గంజాయిని సరఫరా చేయడానికి రూ.3 లక్షలు అడ్వాన్సుగా తీసుకుని పంపించడం జరిగిందన్నారు. రత్నం భర్త రాజు గంజాయి రవాణా కేసులో 5 నెలల క్రితం చైన్నెలో అరెస్టయినట్టు డీఎస్పీ తెలిపారు. ప్రస్తుతం స్వా. దీనం చేసుకున్న గంజాయిని ఆటోలో ఒడిశా నుంచి గబ్బాడ మీదుగా నర్సీపట్నానికి, అక్కడ నుంచి నక్కపల్లి మండలం నెల్లిపూడి వద్ద నిల్వ చేశారని, అనంతరం రాజమండ్రికి తరలిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. గంజాయి, కారుతో పాటు, 4 సెల్‌ఫోన్‌లు, రూ.3 వేల నగదు కూడా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. సీఐ అప్పన్న, ఎస్ఐలు జె.పురుషోత్తం, పోలీసు సిబ్బందిని ఎస్పీ తుహిన్ కుమార్ సిన్హా అభినందించాని తెలిపారు.

ముగ్గురు అరెస్టు..నలుగురు పరార్

నర్సీపట్నం : గంజాయి కేసులో ముగ్గురిని అరెస్ట్ చేయగా, మరో నలుగురు పరారైనట్టు డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమిళనాడు, తిరువళ్ళూరుకు చెందిన తరుణ్ కుమార్ గోపి(24), అల్లూరి జిల్లా, చింతపల్లి మండలం, దోమ లగొంది గ్రామానికి చెందిన గడుగు కొండబాబు(39), చిత్తూరు జిల్లా, సత్యవేడు మండలానికి చెందిన ఎ.దినేష్(30) గంజాయి తరలిస్తుండగా పట్టుకొని అరెస్ట్ చేశామన్నారు. మరో నలుగురు పరారయ్యారని, నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు సీజ్ చేశామని తెలిపారు. ముందస్తు సమాచారంతో రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, గొలుగొండ, నర్సీపట్నం రూరల్ ఎస్ఐలు రామారావు, రాజారావు, సిబ్బంది వాసుబాబు, సాయి సురేష్, నగేష్ టీమ్ మంగళవారం గొలుగొండ మండలం, కొమిర గ్రామ శివారులో మాటువేసి కారు, ముందు రెండు బైక్‌లపై వస్తున్న ఇద్దరు పైలెట్లను అదుపులోకి తీసుకున్నారు. కారులో 24 కేజీల చొప్పున 9 బస్తాల్లో 216 కేజీల గంజాయి పట్టుబడింది. దాని విలువ రూ.50 లక్షలు ఉంటుందన్నారు. ఒడిశా రాష్ట్రం, చిత్రకొండ పోలీసు స్టేషన్ పరిధిలో జనాభాయ్ దగ్గర వారు కేజీ రూ.5 వేలు చొప్పున కొనుగోలు చేసినట్టు విచారణలో వెల్లడైందన్నారు. అక్కడ నుంచి భూసులకోట మీదగా కొమిర గ్రామ శివారుకు తరలించి, అక్కడి నుంచి నర్సీపట్నం మీదుగా తమిళనాడుకు రవాణా చేస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. నిందితులపై పాత కేసులు ఉన్నాయన్నారు. వారిపై పీడీయాక్టు ప్రయోగించేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. నిందితుల ఆస్తులను సైతం జప్తు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. కేసును చేధించిన సీఐ, ఎస్సైలు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



కొమిర గ్రామ శివారులో పట్టుబడిన గంజాయి, నిందితులతో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రేవతమ్మ, ఎస్ఐలు, సిబ్బంది

బొడ్డరేవు వద్ద 320 కిలోలు...

మాడుగుల రూరల్ : వి.మాడుగుల మండలం శంకరం పంచాయతీ శివారు బోడ్డరేవు గ్రామ పరిసరాల్లో నిర్వహించిన దాడుల్లో, 320 కిలోల గంజాయిని పట్టుకుని, 16 మంది నిందితులను అరెస్టు చేసినట్టు అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి స్థానిక పోలీస్‌స్టేషన్లో మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.16 లక్షలు ఉంటుందన్నారు. ఈ కేసులో మరో ముగ్గురు పరారైనట్టు తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాలివి. ఈ నెల 18 వ తేదీ సోమవారం రాత్రి ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ జి. నారాయణరావు, ఏఎస్ఐ, వారి సిబ్బందితో కలిసి బోడ్డరేవు గ్రామ పరిసరాల్లో తనిఖీలు నిర్వహించగా ఆటో నెంబరు ఎపి31టిడి2387లో 16 బ్యాగుల్లో 320 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయితో పాటు 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఇద్దరు శంకరం పంచాయితీ శివారు తాడివలస గ్రామానికి చెందిన వారు కాగా, మిగిలిన 14 మంది అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన వారు. ఈ దాడుల్లో గంజాయి రవాణా చేస్తున్న ఆటోతో పాటు మూడు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లను, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఎ1 నిందితుడు యలమంచిలి పోలీసుస్టేషన్‌లో, ఎ2 నిందితుడు ఎన్‌డీపీసీ చట్టం కింద కేసుల్లో నిందితులుగా వున్నారన్నారు. ఈ గంజాయిని ఒడిశా నుంచి అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. నిందితులను మంగళవారం సాయంత్రం అరెస్టు చేసి, రిమాండుకు పంపించామన్నారు. విలేకరుల సమావేశంలో కె. కోటపాడు సీఐ పైడిపునాయుడు, ఎస్ఐ జి. నారాయణరావు పాల్గొన్నారు. ఈ కేసులో పనిచేసిన సిబ్బందిని ప్రశంసిస్తూ నగదు బహుమతులను డీఎస్పీ చేతుల మీదుగా అందజేశారు.



బొడ్డరేవు వద్ద స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, సీఐ ఇతర పోలీసు సిబ్బంది

అశ్లీల నృత్యాల నిర్వాహకులపై కేసు నమోదు



ఏటికొప్పాకలో అశ్లీల నృత్యాల నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ధనుంజయరావు

యలమంచిలి రూరల్ : యలమంచిలి మండలం ఏటికొప్పాకలో శ్రీకృష్ణాష్టమి వేడుకల ముసుగులో అశ్లీల నృత్యాల నిర్వాహకులపై యలమంచిలి రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.ఈ నెల 17వ తేదీ రాత్రి గ్రామంలో శ్రీకృష్ణుని గుడి వద్ద ప్రత్యేకంగా స్టేజీ ఏర్పాటు చేసిన నిర్వాహకులు ముగ్గురు యువతులతో అశ్లీల నృత్యాలు వేయించారు. పొట్టి దుస్తులతో అసభ్యకరంగా డాన్సులు చేశారు. ఈ వ్యవహారంపై మంగళవారం పత్రికల్లో వార్తలు రావడంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యలమంచిలి రూరల్ పోలీసులు అసభ్యకర నృత్యాల నిర్వాహకులను గుర్తించారు. గ్రామ వీఆర్వో బసనబోయిన జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఎటువంటి అనుమతి లేకుండా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, వాటి ముసుగులో అసభ్యకర నృత్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ ధనుంజయరావు హెచ్చరించారు. ఏటికొప్పాకలో అశ్లీల నృత్యాలు ప్రదర్శించిన యువకులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

• ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు

నాతవరం : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సత్వరం నెరవేర్చేలా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసన మండలి సభ్యుడు గాదె శ్రీనివాసులనాయుడును కోరారు. ఆయన జిల్లేడుపూడిలో బుచ్చెంపేట నూకాలమ్మ తల్లిని దర్శించేందుకు మంగళవారం విచ్చేసిన సందర్భంగా జిల్లా సమగ్ర శిక్ష జేఏసీ కన్వీనర్ పట్నాల సతీష్, నాతవరం మండల శాఖ జేఏసీ కన్వీనర్ అంకంరెడ్డి శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో ఉద్యోగులంతా ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏళ్లతరబడి పని చేస్తున్నా ప్రభుత్వం జీతాలు పెంచలేదన్నారు. మా సమస్యలపై గతంలో ఆందోళనలు చేస్తే ప్రధాన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేటి వరకు కనీసం పట్టించుకోలేదన్నారు. కనీసం ఉద్యోగ భద్రత లేకుండా పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్సీ స్పందిస్తూ వారి సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలను సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. త్వరలో జరిగే శాసన మండలి సమావేశాల్లో కూడా వారి సమస్యలు ప్రస్తావిస్తానని తెలిపారు. మండలానికి విచ్చేసిన ఎమ్మెల్సీని ఎంఈవోలు బ్రహ్మాజీ, కామిరెడ్డి వరహాలబాబు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు రాష్ట్ర నాయకుడు డి. గోపీనాథ్, మండల నాయకులు శెట్టి సుబ్రమణ్యం లాలం శ్రీనివాస్, గుడపర్తి దేముడు, సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు సిహెచ్. వెంకటలక్ష్మి కె.గోవిండ్, అరుణజ్యోతి, ఎస్.సత్యవేణి బి.వి.నాయుడు టి.సాంబమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడుకు వినతి పత్రం ఇస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా జేఏసీ నాయికులు

తల్లి చెంతకు తప్పిపోయిన బాలికలు

మర్రిపాలెం:

ఇంటి నుంచి అదృశ్యమైన ఇద్దరు బాలికలు కంచరపాలెం పోలీసులు, ఒక మహిళ సహకారంతో క్షేమంగా తమ తల్లి చెంతకు చేరుకున్నారు. వివరాలివి. గవర కంచరపాలెంలో నివసిస్తున్న గేదెల రేఖ, ఆమె భర్త రైల్వే స్టేషన్‌లో ఒక ఫుడ్‌కోర్టులో పని చేస్తున్నారు. సోమవారం రాత్రి పని ముగించుకుని రేఖ ఇంటికి తిరిగి వచ్చేసరికి.. ఆమె ఇద్దరు కుమార్తెలు ఇంట్లో లేరు. భయపడిపోయిన తల్లిదండ్రులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ దొరకకపోవడంతో వెంటనే కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తక్షణమే స్పందించి, ఆ బాలికల వివరాలను వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. ఇదే సమయంలో ఆర్.పి.పేట ప్రాంతానికి చెందిన ఒక మహిళ రాత్రి సమయంలో ఆ ఇద్దరు బాలికలు రైల్వే ట్రాక్ సమీపంలోని ఒక జిమ్ ఆవరణలో సంచరించడాన్ని గమనించింది. ఇక్కడ ఎందుకు ఉన్నారని వారిని ప్రశ్నించగా.. ఇంట్లో ఫోన్ పోయిందని, తల్లిదండ్రులు తిడతారని భయంతో ఇంటి నుంచి బయటకు వచ్చామని వారు చెప్పారు. ఆ మహిళ వెంటనే స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తకు విషయం చెప్పింది. రాత్రి కావడంతో ఆ కార్యకర్త ఆ ఇద్దరు బాలికలను తమ ఇంట్లోనే ఉంచి, ఉదయం అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్లి సచివాలయం ఎంఎస్‌కేకు సమాచారం అందించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు.. అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకుని బాలికలను స్టేషన్‌కు తీసుకెళ్లారు. మంగళవారం ఉదయం కంచరపాలెం సీఐ రవికుమార్ సమక్షంలో ఆ బాలికలను వారి తల్లి రేఖకు అప్పగించారు. దీంతో ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

108 డిఫెన్స్ మద్యం బాటిళ్ల స్వాధీనం

• ఇద్దరి అరెస్టు

పెదగంట్యాడ: గాజువాక పరిసర ప్రాంతాల్లో అక్రమంగా డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. పెదగంట్యాడ కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నరసింహారెడ్డి అనే వ్యక్తి నుంచి 15 డిఫెన్స్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో నరసింహారెడ్డి గాజువాక బీసీ రోడ్డులోని వెంకటేశ్వర ఫర్నిచర్ దుకాణం యజమాని జీలకర్ర సుబ్బారావు నుంచి మద్యం కొనుగోలు చేసినట్లు తెలిపాడు. దీంతో పోలీసులు ఆ ఫర్నిచర్ దుకాణంలో సోదాలు చేయగా, మొత్తం 108 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. ఈ మద్యం ఎక్కడ నుంచి వస్తోందని సుబ్బారావును ప్రశ్నించారు. నేవల్ అధికారులు ఫర్నిచర్ కొనుగోలు చేసి, అందుకు బదులుగా మద్యం సీసాలను ఇస్తారని సుబ్బారావు చెప్పాడు. ఈ కేసులో నరసింహారెడ్డి, జీలకర్ర సుబ్బారావును పోలీసులు అదుపులోకి తీసుకుని గాజువాక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ కేసుపై పూర్తి దర్యాప్తు జరుగుతోందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న డిఫెన్స్ మద్యం సీసాలు

భూమికి భూమి.. ఇళ్లకు నగదు పరిహారం ఇవ్వాలి

• రింగురోడ్డు భూసేకరణపై తేల్చిచెప్పిన రైతులు

అచ్యుతాపురం రూరల్ : పీసీపీఐఆర్ రింగు రోడ్డుకు చోడపల్లి నుంచి అప్పన్నపాలెం అలాగే చీమలాపల్లి నుండి కొండకర్ల పంచాయతీల్లో భూములకు వీకె పీసీపీఐఆర్ ప్లానింగ్ అధికారి చైతన్య, వీఎంఆర్‌డీ డీపీఓ వెంకటేశ్వర్రావు, తహసీల్దార్ సత్యనారాయణ ఆయా సచివాలయాల్లో రైతులతో మంగళవారం సమావేశమయ్యారు. చోడపల్లి, చీమలాపల్లి సచివాలయంలో జరిగిన సమావేశంలో రైతులతో మాట్లాడుతూ 80 అడుగుల వెడల్పుతో సేకరిస్తున్న భూములకు, నష్టపోతున్న రైతులకు టీడీఆర్ బాండ్లు ఇస్తామన్నారు. దీనిపై రైతులు మాట్లాడుతూ భూమికి భూమి ఇవ్వాలని, ఇల్లు కోల్పోతున్న వారికి నగదు రూపంలో నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రామన్నపాలెం రైతులు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ దారులు ఉన్నాయని పరిశీలించాలని అన్నారు.

ఉప్పటేరులో మత్స్య సంపద మృత్యువాత

అచ్యుతాపురం రూరల్ : పరిశ్రమల వ్యర్థాల కారణంగా పూడిమడక ఉప్పుటేరులో మత్స్య సంపద మృత్యువాత పడుతుందని స్థానిక మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం ఉప్పుటేరులో కొన్ని లక్షల విలువైన చేపలు మృత్యువాత పడ్డాయి. స్థానికంగా ఉన్న పరిశ్రమల వ్యర్థ రసాయనాలు శుద్ధి చేయకుండా కాలువల ద్వారా సముద్రంలో వదిలేయడంతో మత్స్య సంపద కోల్పోతున్నామని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే చొరవ తీసుకుని పరిశ్రమల యాజమాన్యంపై చర్యలు తీసుకొని మత్స్య సంపదను కాపాడాలని కోరుతున్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



'గాతా రహే మేరా దిల్' పాటల పోటీలో పాల్గొన్న విద్యార్థులు

• పాఠశాలల్లో వారి అభిరుచులను ప్రోత్సహించాలి
• ప్రముఖ సినీ నేపథ్య గాయని కౌసల్య



కార్యక్రమంలో ఆలపిస్తున్న సినీ గాయని కౌసల్య

పాయకరావుపేట: కేవలం విద్యనే కాకుండా విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి వున్న నైపుణ్యాలను వెలికి తీసే కార్యక్రమాలను పాఠశాల యాజమాన్యాలు నిర్వహించాలని ప్రముఖ సినీ నేపథ్య గాయని కౌసల్య అన్నారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల 49 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు విద్యా సంస్థల వివిధ శాఖల విద్యార్థుల మధ్య గాతా రహే మేరా దిల్ పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ సినీ నేపద్య గాయని కౌసల్య, కీబోర్డ్ ప్లేయర్ రవి శేఖర్ హాజరయ్యారు. గాయని కౌసల్య మాట్లాడుతూ ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా, ప్రసిద్ధ గేయ రచయిత ఆనంద్ బక్షి పాటలను ఎంపిక చేసుకోవడం ఈ కార్యక్రమానికి ఎంతో వన్నె తెచ్చిందన్నారు. విద్యార్థినీ విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారని, నిత్యం సాధన చేస్తే భవిష్యత్‌లో మంచి గాయకులుగా రాణించగలరని అన్నారు. ఈ పోటీలు 6 వ తరగతి నుంచి డిగ్రీ వరకు జూనియర్, సీనియర్ విభాగాలలో నిర్వహించారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కౌసల్యను విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ సత్కరించారు. సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, భానుమూర్తి, డాక్టర్ బంగార్రాజు, డా. రామకృష్ణారెడ్డి, బి.సీతారాణి, మేనేజర్ శ్రీనివాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుమ్మపాల: ఈ నెల 20, 22, 24, 25, 26 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ సబ్బవరం సెక్షన్-1 ఏఈ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం-01 సెక్షన్ 33/11 కేవీ కొప్పాక సబ్ స్టేషన్ పరిధి శంకరం ఫీడర్ పనుల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. మండలంలో శంకరం, భట్లపూడి, గొలగాం, గోపాలపురం, రేబాక, అగ్రహారం, కోడూరు, కొండుపాలెం పంచాయతీల పరిధిలోని వినియోగదారులకు గమనించాలని సూచించారు.

నేటితో ముగియనున్న మండల దీక్ష

కశింకోట: స్థానిక గవరపేటలో శారదా గణపతి రామాలయంలో మండల దీక్షగా చేపట్టి నిర్వహిస్తున్న లలితా సహస్ర నామ పారాయణ కార్యక్రమం బుధవారం ముగియనుందని ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు భీశెట్టి దుర్గానాగేశ్వరరావు తెలిపారు. ఆషాఢ మాసం ఏకాదశి రోజున చేపట్టి సహస్ర నామ పారాయణ మండల దీక్ష ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కలశానికి ప్రత్యేక కుంకుమ పూజలు, లలితా సహస్ర నామార్చన, భజన నిర్వహించి శారద నదిలో నిమజ్జనం చేస్తామన్నారు.

అనధికారికంగా గ్యాస్ సిలిండర్లు



పాఠశాల సమీపంలో రోడ్డుపై ఉంచిన గ్యాస్ సిలిండర్లు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని నర్సింగ్‌రావుపేట నారాయణ పాఠశాల సమీపంలో బహిరంగ ప్రదేశంలో అనధికారికంగా గ్యాస్ సిలిండర్లను ఉంచడం తగదని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొణతాల హరనాథ్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనావాసాల మధ్య రోడ్డుపై గ్యాస్ సిలిండర్లు గంటల తరబడి ఉంచుతున్నారని, దీనివల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు రోడ్లపై అక్రమంగా పెడుతున్న గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకొని బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

రైతులకు పశువుల దాణా పంపిణీ

కశింకోట: మండలంలోని 135 మంది రైతులకు సమీకృత మిశ్రమ పశువుల దాణా రాయితీపై అందజేశామని మండల పశు వైద్యాధికారి సిహెచ్. చైతన్యమణి తెలిపారు. ఎండు గడ్డి కొరతను ఎదుర్కొని ఇబ్బంది పడిన పాడి రైతులను ఎంపిక చేసి 50 కిలోల బస్తా దాణా రూ.1110 కాగా, రాయితీ పోనూ రూ.555 అందజేశామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 33 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	---	---
మూడోరకం	3,000	3,350

అనకాపల్లి సినిమాలు

రాజా	: వార్ 2
సత్యనారాయణ స్క్రీన్-1	: వార్ 2
సత్యనారాయణ స్క్రీన్-2	: కింగ్ డమ్
పర్తిసాయి	: మహావతార్ నరసింహం
షిర్డిసాయి	: కూలీ
వెంకటేశ్వర	: హరిహర వీరమల్లు
శ్రీ సత్య	: సోమేశ్వర సులోచన
రామచంద్ర	: వార్ 2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 20 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5, బీ పాజిటివ్-5, ఓ పాజిటివ్-6, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 333 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 249 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

నిండు కుండల్లా చెరువులు

హమ్మయ్య.. రైతాంగం ఊపిరి పీల్చుకుంది. ఖరీఫ్ ప్రారంభం నుంచి వేసవిని తలపించే ఎండలతో ఉక్కిరిబిక్కిరై.. వర్షాకాలంలోనూ వరుణుడు కరుణించక ఆశలు వదులుకున్న తరుణంలో ఉన్నపళంగా భారీ వర్షాలు కురిశాయి. దాంతో చెరువులన్నీ నిండుకుండలా తొణికిసలాడుతున్నాయి. వాగులు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇదే ఉత్సాహంతో రైతులు పొలం బాట పట్టి వరినాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు.



నిండుకుండలా మారిన రేబాక ఊరచెరువు

ఉధృతంగా పారుతున్న వాగులు • ఖరీఫ్ పంటలకు ఊపిరిపోసిన వర్షం • వరినాట్ల పనుల్లో రైతులు



ఉధృతంగా ఏరులై పారుతున్న శారదానది

తుమ్మపాల: మండలంలో నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు చెరువులు నిండుకుండల్లా మారాయి. ఎగువ ప్రాంతాలైన కొండలు, గుట్టల నుంచి వాగులు, గెడ్డల్లో మీదుగా వర్షపు నీరు ఏరులై పారింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి జలమయమయ్యాయి. మండలంలో అన్ని దారులు నీటితోనే నిండిపోయాయి. శారదానది పరివాహక గ్రామాల్లో వర్షపు నీటి ప్రవాహం మరింత ఉధృతంగా మారింది. దొంగ గెడ్డ, ఎల్లయ్య కాలువలు ఉధృతికి ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందారు. మొన్నటి వరకు ఎండుముఖంతో దర్శనమిచ్చిన చెరువులు ఇప్పుడు జలపాతాల్లా మారాయి. కూండ్రం, కుంచంగి, సుందరయ్యపేట, అచ్చయ్యపేట, దిబ్బపాలెం, ఊడేరు, మామిడిపాలెం, మాకవరం, కొండుపాలెం, రేబాక, గొలగాం గ్రామాల్లో చెరువులు నిండాయి. ట్రాక్టర్లతో దమ్ములు చేపడుతున్నారు. మరి కొంతమంది వరినాట్లు వేస్తున్నారు.

రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు....

గత నెలలో తీవ్ర ఎండలతో ఆందోళన చెందిన రైతులు భారీ వర్షాలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఎండ తీవ్రత మరింత కరువు వ్యాపిస్తుందని భయపడుతున్న వేళ భారీ వర్షాలు అందరిని తడిసిముద్ద చేశాయి. ఈ నెల 11న మొదలైన వాన మండలంలో అత్యధికంగా 20.4 మిల్లీ మీటర్లు నమోదు కాగా, వరుసగా 13న 38.6, 14న 25.6, 15న 30.4 మిల్లీ మీటర్లుగా తీవ్ర స్థాయిలో వర్షం పడింది. 17వ తేదీన ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకంగా 73.2 మిల్లీ మీటర్ల, 18న 122.2 మిల్లీ మీటర్లు నమోదై రికార్డు స్థాయిలో వర్షపు నీరు పొలాలు, రోడ్లపై చేరిపోయింది.

జలమయమైన లోతట్టు ప్రాంతాలు...

మండలంలో పలు గ్రామాల్లో లోతట్టు నివాసాల్లో వర్షపు నీరు చేరి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. దిబ్బపాలెం, కుంచంగి, తగరంపూడి, మెట్టపాలెం, తుమ్మపాల, శంకరం పలు గ్రామాల్లో వర్షపు నీరు చేరి అక్కడక్కడా ఇల్ల ముందు నీరు నిలిచిపోవడంతో నివాసితుల వారు భయందోళనలకు గురయ్యారు. తుమ్మపాలలో పలు వీధుల్లో మురుగు నిర్వహణ లోపంతో కొంత మేర నీరు నిలిచిపోయింది. శంకరం పంచాయతీ సతెమ్మపేటలో గృహాల్లో మోకాళ్లోతు నీరు చేరి రెండు రోజలపాటు నిల్వ ఉండిపోవడంతో అక్కడ నివాసితులు ఆందోళనకు గురయ్యారు. పశువులు కల్లాలకు వెళ్లే బాటల్లో నీరు చేరి బురదమయంగా మారింది. రైతులు రాకపోకలు చేయలేక, పశువుల మేత, పోషణకు ఇబ్బందులు పడుతున్నారు.

దమ్ములకు సిద్ధం



వర్షకాలంలో తీవ్ర ఎండలతో భయాందోళనలకు గురైన వేళ భారీ వర్షాలతో రైతులంతా ఊపిరిపీల్చుకున్నారు. నెల రోజుల క్రితం వేసిన వరివిత్తనాలు తీవ్ర ఎండలకు నాటకుండా ఉండిపోయాయి. చుక్క నీరు లేకపోవడంతో కరువు తప్పదని భావించాం. మంచినీటికి ఇబ్బందులు తప్పవనే పరిస్థితుల నుంచి పుష్కలంగా వర్షపు నీరు చేరింది. గ్రామాల్లో చెరువులన్నీ నిండుగా మారాయి. వాగులు, గోతుల్లో సైతం నీటి చుక్కలు చేరుకున్నాయి. దమ్ములు మొదలు పెట్టేందుకు సిద్ధమవుతున్నాం.

– కర్రి మహాలక్ష్మినాయుడు, రైతు

శాంతించిన శారదా నది



కశింకోట వద్ద తగ్గిన శారదా నది ఉధృతి.. నడపని దోనెలు

కశింకోట: శారదా నది శాంతించింది. తుపాను వర్షాల కారణంగా నది ఉధృతంగా సోమవారం ప్రవహించిన సంగతి తెలిసిందే. అయితే రెండో రోజు మంగళవారం వరద నీరు తగ్గుముఖం పట్టినప్పటికి ఇంకా ప్రవాహ వేగం ఉండటంతో స్థానిక గవరపేట వద్ద నదిపై దోనెలు వేయలేదు. దీంతో పొలాలకు, పశువుల పాకలకు రాకపోకలు సాగించాల్సిన ఈ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. గ్రామ శివారులో దూరంగా ఉన్న వంతెన మీదుగా 3 కిలోమీటర్ల దూరం నడిచి తమ కార్యకలాపాలు సాగించుకోవలసిన పరిస్థితి ఎదుర్కొన్నారు. ఇక్కడ వంతెన ఉంటే ఇబ్బంది ఉండేది కాదని, ఇప్పటికైనా నిర్మాణం చేపట్టి పూర్తి చేయడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆధార్ సెంటర్ల ఏర్పాటు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ప్రజల సౌకర్యార్థం రెండు ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు నీలకంఠ వీధి, అంబేడ్కర్ నగర్ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. మండలంలో అక్కిరెడ్డిపాలెంలో ఈ నెల 20, 21 తేదీల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేశామని సచివాలయ సిబ్బంది తెలిపారు.

గణపతి మాలధారులకు ఉచిత దర్శనానికి వినతి



దేవదాయ శాఖ సహాయ కమిషనర్ సుధారాణికి వినతిపత్రం అందజేస్తున్న ఆదారి కుమార్‌స్వామి

అనకాపల్లి: గణపతి మాలాధారణ ధరించిన భక్తులకు చోడవరంలో స్వయంభూ కార్యసిద్ధి వినాయకుని ఉచిత దర్శనం కల్పించాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపకుడు ఆదారి కుమార్‌స్వామి కోరారు. స్థానిక గవరపాలెం జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.ఎల్.సంధ్యారాణికి మంగళవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూ పండగల్లో ప్రధానంగా గణపతి పూజతో కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అటువంటి విశిష్టత కలిగిన స్వామివారి భక్తులకు ఈ నెల 27న చోడవరం వినాయక ఆలయంలో ఉచితంగా దర్శనం కల్పించాలని అక్కడ ఈవోకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొడుకుల శ్రీకాంత్, దాడి బుజ్జి, వేగి కార్తీక్, కర్రి భరత్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో వర్షపు నీటిని బయటకు తీసివేయాలి



శాస్త్రవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏడీఆర్ శ్రీలత

అనకాపల్లి: వరుసగా కురిసిన వర్షాలకు, పొలాల్లో నీటిని బయటకు పోయేందుకు వీలుగా పాయలను ఏర్పాటు చేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ టి.శ్రీలత సూచించారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. వరి నారుమడిలో పొడ, గోధుమ రంగు మచ్చ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు కార్బెండాజిం 1 గ్రా. లేదా హెక్సాకోనజోల్ 2 మి. లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వరిలో జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేటు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి. పొటాష్ లోపాన్ని గమనించినట్లయితే ఎకరాకు 20 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను వేయాలి. నాట్లు వేసుకునేటప్పుడు ఆకు చివరలను తుంచి 20 ఇన్‌టూ 15 సెం.మీ. దూరంలో కుదురుకు 2-3 మూనలు చొప్పున చ.మీ.కు 33 మూనలు ఉండేలా చూసుకోవాలి. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ బాటలు తీయాలి. వాతావరణ పరిస్థితులకు కంది పైరులో వేరుకుళ్లు, కాండం కుళ్లు తెగులు ఆశించే ఆవకాశం ఉందని, నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా కార్బండజిమ్ 1 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి మొక్క మొదళ్లు తడిచేలా పిచికారి చేయాలి. వేరుశనగ పైరులో కాండం కుళ్లు తెగులు ఆశించవచ్చని, టెబుకొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించవచ్చు. చెరకుపైరులో మొజాయిక్ తెగులును వ్యాప్తి చేసే పేనుబంక పురుగుల నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. 5గ్రా.ల మల్టి కెను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వర్షాధార చెరకులో మొవ్వకుళ్లు తెగులు నివారణకు కార్బెండజిం 1 గ్రా. లేదా మాంకోజేబ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి ఉధృతిని బట్టి 10-15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. వర్షాలకు చెరకులో నీరు నిలిచినట్లయితే వెంటనే నీరు తీసేసి బూస్టర్ డోస్‌గా ఎకరాకు 20 కిలోల యూరియాను వేసుకోవాలి. అరటిలో సిగటోక తెగులు ఆశించి, అధిక వర్షాలకు తెగులు వ్యాపిస్తుందని, నివారణకు ప్రోపికోనజోల్ 1 మి.లీ. లేదా టెబుకొనజోల్, ట్రిఫ్లోక్సిస్ట్రోబిన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి రెండు మూడు సార్లు 25 రోజులు వ్యవధిలో పిచికారి చేయాలి. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, వి.గౌరి, ఆర్.సరిత, వి.చంద్రశేఖర్, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణంతో ఆదాయం కోల్పోయాం

ప్రభుత్వమే ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల వినతి



ఏవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్లకు ఆర్టీసీలో ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల గోవింద్ కోరారు. ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానం నుంచి నెహ్రూచౌక్ మీదుగా ఆర్డీవో కార్యాలయంలో వరకూ ఆటో డ్రైవర్లు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి కార్యాలయంలో ఏవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆదాయం కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఆదాయం చూపించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆర్టీసీలో ఆటో డ్రైవర్లకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లుకు రోజుకు రూ.100 ఆదాయం లేకుండా పోయిందన్నారు. వాహన మిత్ర రూ.15 వేలు విడుదల చేయాలని, జీవో నంబర్ 21, 31 రద్దు చేసి డ్రైవర్లకు జీవన హక్కులు కల్పించాలన్నారు. ఆటోలు, మోటార్ వాహనాలు ఎఫ్‌సీలు, డ్రైవింగ్ లైసెన్స్ ప్రైవేటు సంస్థలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేసి పాత పద్ధతిని ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. జాతీయ బ్యాంకుల ద్వారా పావలా వడ్డీకి రుణాలు మంజూరు చేయాలన్నాని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కోరిబిల్లి జగదీష్, నాయకులు పొలిమేర శెట్టి అంజి, పెంటకోట రాము, కుర్రం నాగరాజు, బాపు నాయుడు, రాజు, బంటు నారాయణ, పడాల నాగరాజు, రమణ, దివాకర్, దేముడు, సుభాని, అభి, రాజు, భరత్, నాయుడు, గంట అప్పారావు, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల నియంత్రణకు చర్యలు



జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వీరజ్యోతి

నర్సీపట్నం : మారిన వాతావరణ పరిస్థితులు, భారీ వర్షాల కారణంగా పట్టణాలు, గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వీరజ్యోతి సూచించారు. ఖాళీ ప్రదేశాల్లో మురుగు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, లేదంటే దోమలు విజృంభించి మలేరియా జ్వరాల బారినపడే ప్రమాదం ఉందన్నారు. వైరల్ జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారని, ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నామన్నారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా నీళ్లు, మజ్జిగ, పండ్ల రసాలు, నిమ్మరసం వంటివి తరచూ తీసుకోవాలని సూచించారు. జ్వరం తీవ్రంగా ఉంటే తక్షణం సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోని మందులు వాడాలన్నారు. జ్వరాలున్న చోట శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

త్వరలో వైఎస్సార్‌సీపీ మండల, గ్రామ కమిటీలు

పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం: వైఎస్సార్‌సీపీ మండల, గ్రామాల కమిటీలు త్వరలో నియమిస్తామని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకుని ఉన్నవారికి రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలకు ఏడాది పాలనలో ప్రజలు విసుగుపోయారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పెట్టి ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టారన్నారు. బస్సులో ప్రయాణించే మగవారికి సీట్లు లేకుండా ఉంటున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏ పథకం ప్రవేశ పెట్టినా అన్ని వర్గాల వారికి సమన్యాయం చేసే పరిస్థితి లేదన్నారు. చాలా మందికి తల్లికి వందనం నగదు రాని పరిస్థితి ఉందన్నారు. అన్నదాత సుఖీభవ పరిస్థితి అలానే ఉందన్నారు. ఉచిత గ్యాస్ ఎన్ని ఇచ్చారో, ఎవరికి ఇచ్చారో వారికే తెలియదన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజ లు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అప్పుడు మరలా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే అందరికీ మంచి భవిష్యత్తు ఉంటుందన్నా రు. వైఎస్సార్ సీపీ శ్రేణులపై కూటమి నేతల వేధింపులు మరింత పెరిగాయన్నారు. వాటిని తిప్పి కొట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువర్మ, వైస్ ఎంపీపీ చోడి పల్లి అప్పన్న, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షు డు కర్రి సత్యనారాయణ, యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, నాయకులు అల్లాడ నాగరాజు, అద్దేపల్లి సూకునాయుడు, చొప్పా రాజు, పొలుమూరి అప్పలరాజు, పిట్ల నాయుడు, వైబోయిన సత్యనారాయణ, తూము బుచ్చిబాబు, వీసం ప్రకాష్, దార్లపూడి శ్రీను, చేకూరి అశోక్‌రాజు, నక్కా నాగేశ్వరరావు, గరగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దిగుబడి బాగున్నా.. ఆదాయం లేదన్నా



విత్తనాలకు తీసిన పండిన ఆగాకర



ఆగాకర కాయలు అమ్మేందుకు సిద్ధం చేస్తున్న రైతులు

- ఆగాకర రైతుకు గిట్టుబాటు కాని ధరలు
- సిండికేట్‌గా మారిన ప్రైవేటు వ్యాపారులు
- తక్కువ ధరకు కొనుగోళ్లు
- మార్కెట్లో అధిక ధరలకు విక్రయాలు



విస్తరంగా సాగు చేస్తున్న పందిరిపై ఆగాకర పంట

నాతవరం : ఈ ఏడాది ఆగాకరకాయలు విస్తారంగా సాగు చేశారు. మండలంలో మాధవగనగరం, తాండవ, ఉటమల్ల, తాళ్లపాలెం, వల్సంపేట, గంటావారి కొత్తగూడెం, చమ్మచింత, పాట్టినాగన్నదొరపాలెం, నాతవరం తదితర గ్రామాల్లో రైతులు సుమారుగా 300 ఎకరాలకుపైగా ఆగాకర తోటలు పందిరిపై సాగు చేస్తున్నారు. ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే ఆగాకర తోటలు ద్వారా ఆదాయం బాగుండడంతో రైతులు ఆసక్తి చూపారు. ప్రైవేటు వ్యాపారులు మొదట్లో రైతు వద్ద జూన్‌లో కిలో రూ.180 చొప్పున కొనుగోలు చేశారు. తరువాత వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి రేటు తగ్గించేశారు. దిగుబడి ముమ్మరంగా పెరిగిన సమయంలో ఒకేసారి రైతు వద్ద కిలో రేటు రూ.60లకు తగ్గించేశారు. దీంతో రైతులంతా లబోదిబోమంటున్నారు. మార్కెట్లో అధిక ధరలు పలుకుతున్న సమయంలో రైతులకు గిట్టుబాటు లేకుండా దళారులు ఒకేసారి కిలో రేటు రూ.60 తగ్గించేశారు. ఎంతో కష్టపడి పండించిన పంటకు ఆశించిన ధర రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది దిగుబడి బాగున్నా ఆదాయం రాకపోవడంతో ఉసూరుమంటున్నారు. ఇక్కడ రైతుల నుంచి కొనుగోలు చేసిన ఆగాకర కాయలు లారీలపై పట్టణ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. వ్యాపారులు తాము తెచ్చిన కాటాలతో తూకం వేసి కొనుగోళ్లు జరుపుతున్నారు. దీంతో తూకంలో కూడా మోసపోతున్నామని రైతులు చెబుతున్నారు. దీనిని ప్రశ్నించిన రైతుల వద్ద పంట కొనుగోలు చేయకుండా వివక్ష చూపిస్తున్నారు. దీంతో మరోమార్గం లేక వచ్చిన ధరలకే రైతులు పంటను తెగనమ్ముకుంటున్నారు.

ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి...

ఆగాకర సాధారంగా ఏప్రిల్‌లో సాగు చేస్తారు. మొక్కలు పెరిగే సమయంలో పంట పొలాల్లో ఐరన్ ఊసలతో పందిరి ఏర్పాటు చేస్తారు. ఆగాకర పంటకు పందిరి ఏర్పాటుకు కాయలు కోసేందుకు ఎకరానికి రూ.లక్ష వరకు పెట్టుబడి ఆవుతుందంటున్నారు. ఈ ఏడాది పంట ప్రారంభ సమయంలో రేటు పెంచి బాగా దిగుబడి వచ్చిన ఈ సమయంలో ధర తగ్గిస్తే మేం ఎలా బతకాలంటూ రైతులు వాపోతున్నారు.

కానరాని ప్రభుత్వ ప్రోత్సాహం

పందిరిపై కాయకూరలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రుణ సదుపాయం కల్పిస్తుందని ప్రచారం చేసేవారు. ఈ ప్రాంతంలో ఆగాకర తోటలు సాగు చేసే ఏ రైతుకు ఏలాంటి సాయం అందించలేదని రైతులకు సలహాలు ఇచ్చే అధికారుల జాడ కన్పించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు రైతులు పండించిన పంటకు మార్కెట్ సదుపాయం కల్పిస్తే దళారులు బెడద తగ్గుతుందంటున్నారు. ఇటీవల ఈ గ్రామాలు మీదుగా తాండవ రిజర్వాయరు నీరు విడుదలకు స్పీకరు అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి అనిత విచ్చేసినపుడు ఆగాకర రైతులంతా కలిసి తమ సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నించినా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడంతో ఫలితం లేకపోయింది.

అమ్ముకునే దారి లేదు...



కష్టపడి పండించిన పంట గిట్టుబాటు ధరకు అమ్ముకునే దారి లేక చాలా బాధపడుతున్నాం. ప్రైవేటు వ్యాపారులు అడిగిన రేటుకు అమ్ముతున్నాం. మొదట్లో కిలో రూ.180 వద్ద కొనుగోలు చేశారు. బయట మార్కెట్లో అధిక ధరలు ఉన్నా మాకు కేవలం రూ.60 ధర ఇస్తున్నారు. మరోమార్గం లేక దక్కిన రేటుకే అమ్ముకుంటున్నాం. పెట్టుబడిని బట్టి వాతావరణ పరిస్థితులను బట్టి దిగుబడులు వస్తాయి. కిలోంరేటు రూ.100 తగ్గకుండా ఉంటే రైతు కష్టానికి ఫలితం ఉంటుంది.

– రెడ్డి వరహాలు, గంటావారి కొత్తగూడెం గ్రామం

41 హెక్టార్లలో నీట మునిగిన వరి పంట

చీడికాడ : మండలంలోని పలు పంచాయతీల్లో అల్పపీడన ప్రభావంతో నీట మునిగిన వరి పంటను ఏవో కృష్ణవేణి మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ అల్పపీడన ప్రభావంతో గడిచిన మూడు రోజులుగా మండలంలోని అర్జునగిరి, జైతవరం, శిరిజాం, చీడికాడ, తురువోలు, తంగుడుబిల్లి గ్రామాల్లో 41 హెక్టార్లు వరిపంట నీట మునిగినట్టు గుర్తించామన్నారు. మడిలో నీటిని చిన్నచిన్న కాలువల ద్వారా బయటకు పంపించేలా చూడాలన్నారు.